క్లుప్తంగా

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేత



పెదనందిపాడు: పెదనందిపాడు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో సమర్థనం ఇంటర్నేషనల్ ట్రస్ట్ ఫర్ డిజేబుల్డ్ సంస్థ దివ్యాంగ విద్యార్థులకు రూ.53 వేల స్కాలర్‌షిప్‌లను అందజేసింది. నగదును విద్యార్థులు షేక్ నజ్మా, పోలకం నవీన్, ఆకుల నరేంద్ర, గుంటూరు శివకుమార్, షేక్ నూర్ అహ్మద్, షేక్ మాబు సుభానీకి సంస్థ ప్రతినిధులు పంపిణీ చేశారు. కళాశాల కోశాధికారి లావు ఆదిశేషయ్య, ప్రిన్సిపల్ వీర రాఘవయ్య, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

'మా నమ్మకం నువ్వే జగన్' ప్రచారం ప్రారంభం నేడు

గుంటూరు రూరల్: 'జగనన్నే మా భవిష్యత్తు – మా నమ్మకం నువ్వే జగన్' ప్రచార కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం 10:30 గంటలకు ప్రత్తిపాడు నియోజకవర్గంలోని 40వ డివిజన్ పెద పలకలూరు గ్రామంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత లాంఛనంగా ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం గురువారం ప్రకటించింది. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని పేర్కొంది.

పేదలకు దుస్తుల పంపిణీ



గుంటూరు రూరల్: నగర శివారురులోని లాం నందున్న చలపతి ఇంజినీరింగ్ కళాశాల, యలమంచిలి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో లాం గ్రామంలోని పేద ప్రజలకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖర్, విద్యార్థులు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు సేవా కార్యక్రమాల కోసం నిధులు సేకరించి పేదవారికి సహాయం చేయటం సంతోషకరమన్నారు. రూ 20 వేల విలువ చేసే వస్త్రాలు, దుప్పట్లు, చీరలు, లుంగీలు గ్రామంలో ఎంపిక చేయబడిన పేదలకు పంపిణీ చేసినట్లు తెలిపారు. సేవా కార్యక్రమాలో పాల్గొన్న విద్యార్థులను చలపతి విద్యాసంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.కిరణ్‌కుమార్ అభినందించారు.

'పది' విద్యార్థులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ



కాకుమాను: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు గురువారం వట్టి చెరుకూరు మండలానికి చెందిన శ్రీ రాములు ట్రస్టు ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ట్రస్టు సభ్యులు మాట్లాడుతూ విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలనే ఉద్దేశంతో మజ్జిగ ప్యాకెట్లు అందిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అత్యాచారం కేసు నమోదు..

పెదనందిపాడు: మానసిక స్థితి సరిగా లేని యువతిపై ఓ యువకుడు అత్యాచారం చేశాడని గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పెదనందిపాడు ఎస్‌ఐ అబ్దుల్ రెహమాన్ వివరాల మేరకు.. గోగులమూడి గ్రామానికి చెందిన బాధిత యువతి, అదే గ్రామానికి చెందిన కారంపూడి లచ్చం సుబ్బారావు అనే వ్యక్తి పశువులు కాసేందుకు వెళ్లేవారు. ఈ క్రమంలో యామమాటలు చెప్పి.. ఆమెపై సుబ్బారావు పలుమార్లు అత్యాచారం చేశాడని యువతి తల్లిదండ్రులు ఫిర్యాదులో పేర్కొన్నారు. కూతురు అనారోగ్యంగా ఉండటంతో వారు డాక్టర్ వద్దకు తీసుకెళ్లి.. పరీక్ష చేయించగా..గర్భవతి అని తెలిసిందని చెప్పారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు. యువతిని వైద్య పరీక్షల నిమిత్తం బాపట్ల ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. ప్రత్తిపాడు సీఐ వెంకటసుబ్బారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విగ్రహం తొలగింపు ఆలోచనే లేదు: మేయర్

నెహ్రూనగర్: రాజకీయ మనుగడ కోల్పోయిన కొందరు నేతలు ఉనికిని కాపాడుకునేందుకు కుటిల ప్రయత్నాలు చేస్తున్నారని, విగ్రహాల్ని అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేయడం సమంజసం కాదని నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు పేర్కొన్నారు. చుట్టుగుంట సెంటర్‌లో ఉన్న స్వాతంత్య్ర సమరయోధుడు కన్నెగంటి హనుమంతురావు విగ్రహాన్ని తొలగిస్తున్నారని సోషల్ మీడియాలో వస్తున్న ప్రచారాలపై ఆయన పై విధంగా స్పందించారు. సమరయోధులు, ప్రముఖ నాయకుల విగ్రహాలను గౌరవించి వాటిని కాపాడుకునే సంస్కృతి తమదని పేర్కొన్నారు. ప్రజలతో ఛీత్కరించబడి రాజకీయాల్లో తమ ఉనికిని చాటుకునేందుకు కొందరు ఇలాంటి నీచ రాజకీయాలకు తెరదీస్తున్నారని మండిపడ్డారు. ప్రజలంతా వారిపై అప్రమత్తంగా ఉండాలని మేయర్ కోరారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

- వేజెండ్లలో గడప గడపకు మన ప్రభుత్వం
- ఇంటింటికీ ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య

వేజెండ్ల(చేబ్రోలు): రాష్ట్రంలో పేదల అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య అన్నారు. వేజెండ్ల గ్రామంలో గురువారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. అధికారులు, స్థానిక నాయకులతో కలసి ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను తెలియజేశారు. ప్రభుత్వ పథకాలతో కుటుంబాలు పొందిన లబ్ధిని వివరించారు. స్థానికుల నుంచి వచ్చిన సమస్యలను తెలుసుకుని తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య మాట్లాడుతూ పేద, మధ్య తరగతి కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు ప్రవేశపెట్టారన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఎన్ని ఇబ్బందులు ఉన్నా సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే ఉన్నారని తెలియజేశారు. పార్టీలకు, గ్రూపులకు, వర్గాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. ప్రభుత్వం పథకాలు.. లబ్ధిదారులకు పింఛన్లు, రైతు భరోసా, అమ్మ ఒడి వంటి పథకాల ద్వారా నగదు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వస్తున్న ప్రతి సమస్యను నోట్ చేసుకుని, స్థానిక అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తాగునీరు, కాలువలు, ఇళ్ల స్థలాలు మంజూరు వంటి సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కాసు ఈశ్వరరెడ్డి, శనగల వెంకటరెడ్డి, అజయ్, ఎంపీడీఓ బాబూరావు, తహసీల్దారు సుజాత, సచివాలయం సిబ్బంది వలంటీర్లు పాల్గొన్నారు.

'మా నమ్మకం నువ్వే జగన్' ప్రచార కిట్ల పంపిణీ



వెల్లలూరులో ప్రచార కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రోశయ్య



చెన్నకేశవస్వామి ఆలయంలో ఎమ్మెల్యే వెంకటరోశయ్య

చేబ్రోలు: 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంలో భాగంగా పొన్నూరు మండలం వెల్లలూరు గ్రామంలో గురువారం ప్రచార కిట్లు పంపిణీ చేశారు. పొన్నూరు శాసన సభ్యుడు కిలారి వెంకటరోశయ్య పాల్గొని, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు దిశానిర్దేశం చేశారు. సమష్టిగా ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ భవనం వంశీ రెడ్డి, సర్పంచ్ ఇక్కుర్తి మల్లికార్జునరావు, వైస్ ఎంపీపీ అంబటి వీర రాఘవయ్య, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులు పాల్గొన్నారు. పెదకాకాని, చేబ్రోలు మండలాల్లోనూ కిట్లను స్థానిక నాయకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెదకాకాని ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, చేబ్రోలు మండల కన్వీనర్ కె.పాములు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా చెన్నకేశవుని బ్రహ్మోత్సవం

ములుకుదురు (చేబ్రోలు): ములుకుదురు గ్రామంలోని చెన్నకేశవ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. పొన్నూరు శాసన సభ్యుడు కిలారి వెంకటరోశయ్య పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. వేలాది భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఇరిగేషన్ శాఖ డైరెక్టర్ దాసరి నారాయణరావు , జిల్లా వ్యవసాయ శాఖ సలహా మండలి డైరెక్టర్ బొద్దులూరి రంగారావు, ములుకుదురు గ్రామ సర్పంచ్ కందుల దుర్గాదేవి సుబ్బారావు, ఎంపీటీసీ కందుల సరోజినీ వెంకటేశ్వర్లు, స్థానిక నాయకులు రఘురామ విద్యాసాగర్, వంశీరెడ్డి, రుద్రపాటి ఆదిశేషు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రోశయ్య మానవత్వం..

చేబ్రోలు: పొన్నూరు మండలం పచ్చల తాడిపర్రు గ్రామ పరిధిలోని జిల్లా పరిషత్ హైస్కూల్ సమీపంలో గురువారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఆ సమయంలో పొన్నూరు వైపు వస్తున్న శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య వెంటనే కారు ఆపి.. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులను పోలీసు వాహనంలో దగ్గరుండి ప్రభుత్వ ఆసుపత్రికి పంపించారు. ఎమ్మెల్యే రోశయ్య తన మానవత్వాన్ని చాటుకున్నారు. గుంటూరు వైద్యులతో మాట్లాడి.. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఫోన్‌లో కోరారు. ఎమ్మెల్యేతో పాటు స్థానిక పార్టీ నాయకులు ఉన్నారు.

శివాలయం పూజారి సస్పెన్షన్

ఆదేశాల కాపీని ఇంటి గోడకు అంటించిన సిబ్బంది



అర్చకుని ఇంటి గోడకు సస్పెన్షన్ కాపీ అంటిస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్

పెదకాకాని: పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవస్థానంలో పనిచేస్తున్న పూజారి చదలవాడ జాలయ్యను సస్పెండ్ చేస్తూ ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. శివాలయంలో నాలుగు రోజులుగా డ్యూటీల విషయంలో అర్చకుల మధ్య వివాదం కొనసాగుతోంది. గత బుధవారం ఆలయం ప్రధాన అర్చకుడు పొత్తూరు ప్రసాద్‌ను ఉప ప్రధాన అర్చకుడు చదలవాడ జాలయ్య.. ఏసీ, సిబ్బంది సాక్షిగా దూషించాడు. ఇరువురి మధ్య వివాదం పెరిగి అసభ్యంగా మాట్లాడటంతో పాటు కుర్చీ ఎత్తి కొట్టబోయారు. దీనిపై ప్రధాన అర్చకుడు ప్రసాద్ ఫిర్యాదు చేయగా ఏసీ శ్రీనివాసరెడ్డి వెంటనే స్పందించారు. జాలయ్యపై శాఖపరమైన చర్యలు తీసుకున్నారు. ఏడు అభియోగాలతో అతనిని విధుల నుంచి తొలగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. సస్పెండ్ ఉత్తర్వులు తీసుకునేందుకు అర్చకుడు నిరాకరించడంతో ఆలయ సిబ్బంది ఇంటి గోడకు సస్పెండ్ ఉత్తర్వులు అంటించారు. దీంతో ఆయనను తాత్కాలింగా విధుల నుంచి తొలగించడం జరిగిందన్నారు. అలానే గురువారం ఆలయ స్థానాచార్యుడు, అర్చకులతో సమావేశమైన ఏసీ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆలయంలో ఎటువంటి పూజలకైనా ప్లేటు కలెక్షన్ చేయరాదని, ఎవరైనా నగదు వసూలు చేసినట్లు నిర్ధారణ అయితే శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

ఆడపడుచులకే అగ్ర తాంబూలం

- రాష్ట్రంలో మహిళా రాజ్యం పరిపాలన
- అన్నగా సీఎం వైఎస్ జగన్‌ను ఆశీర్వదించండి
- ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్



వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ మాణిక్యవరప్రసాద్ తదితరులు

పట్నంబజారు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏ రంగంలోనైనా ఆడపడుచులకే అగ్ర తాంబూలం ఇస్తారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ చెప్పారు. బృందావన్ గార్డెన్స్‌లో రీజనల్ కార్యాలయంలో గురువారం జగనన్న నవ్యోత్సవాల్లో భాగంగా 'జగనన్న పాలనలో మహిళా సాధికారిత' అనే అంశంపై సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నగర అధ్యక్షురాలు గనిక ఝాన్సీ అధ్యక్షత వహించారు. ముందుగా మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ మహిళలకు అన్నగా అండగా ఉంటానని భరోసానిస్తున్న సీఎం జగన్‌ను మహిళా లోకం మరోసారి ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ మహిళా నేత నూరిఫాతిమా మాట్లాడుతూ మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ఇచ్చిన ప్రతి మాటతో పాటు, ఇవ్వని ఎన్నో హామీల్ని సైతం అమలు చేసిన సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందని తెలిపారు. పార్టీ మహిళా విభాగం నగర అధ్యక్షురాలు గనిక ఝాన్సీ మాట్లాడుతూ ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం చేయని విధంగా మహిళల కోసం అనేక పథకాలు అమలు చేస్తున్న ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, కార్పొరేటర్లు, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు, అనుబంధ విభాగాల అధ్యక్షులు బత్తుల అనూరాధ, చంద్రగిరి కరుణకుమారి, బొద్దుపల్లి పద్మజ, మేరిగ విజయలక్ష్మి, మల్లిబోయిన శ్రీవల్లి, మనోరంజని, వనజాక్షి, విజయమాధవి, పిల్లి మేరి, మాదా రాధాకృష్ణ, కష్ణం హరికృష్ణారెడ్డి, నాలారి ప్రభాకర్, వి. ఓం ప్రకాష్‌రెడ్డి, అల్లాబక్షు, చెరుకూరి సాంబశివరావు పాల్గొన్నారు.

12న కాటూరి మెడికల్ కాలేజీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: కాటూరి మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఈనెల 12న ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ కె.శ్రీనివాసరెడ్డి గురువారం తెలిపారు. పెదనందిపాడు గ్రామంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ప్రాంగణంలో ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించనున్న శిబిరంలో ఉచితంగా అన్ని రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి మందులు కూడా అందజేస్తారని పేర్కొన్నారు. శిబిరానికి వచ్చేవారికి భోజన వసతి ఏర్పాటు చేశామని, ప్రజలంతా వినియోగించుకోవాలని ఆయన కోరారు.

వైద్యసేవలు సామాన్యులకు చేరువ చేయాలి



ఆసుపత్రిని ప్రారంభిస్తున్న డాక్టర్ రాఘవశర్మ, డాక్టర్ విజయ

గుంటూరు మెడికల్: నానాటికి ఖరీదవుతున్న వైద్య సేవల్ని సామాన్యులకు చేరువ చేయాలనే లక్ష్యంతో సామాన్య వైద్యశాల ఏర్పాటు చేయడం అభినందనీయమని సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పి.వి.రాఘవశర్మ, సీనియర్ న్యూరాలజిస్టు డాక్టర్ పి.వి జయ అన్నారు. స్థానిక బృందావన్‌గార్డెన్స్ ఎన్టీఆర్ స్టేడియం కాంప్లెక్సులో గురువారం ఫిజీషియన్ డాక్టర్ ఈదర ప్రజ్ఞాంజలి ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన వైద్యశాలను ముఖ్య అతిథులుగా వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాఘవశర్మ మాట్లాడుతూ కోవిడ్ సమయంలో ఫిజీషియన్ల పాత్ర చాలా కీలకంగా మారిందని, అన్ని రకాల వ్యాధులకు ప్రాథమిక వైద్య సేవలు అందించడంలో ఫిజీషియన్లు ముందుంటారని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ మధుమేహ వ్యాధి నిపుణులు ఈదర కృష్ణమూర్తి, డాక్టర్ ప్రజ్ఞాంజలి, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

అలరించిన కవి సమ్మేళనం



పాత గుంటూరు: కొరిటిపాడు సాకేతపురంలోని సాకేత రామాలయంలో శ్రీరామ నవమి పురస్కరించుకుని గుంటూరు జిల్లా రచయితల సంఘం, శ్రీ సీతారామాంజనేయ సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం కవి సమ్మేళనం నిర్వహించారు. జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్. ఎం. సుభాని కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ ఎం. లలిత కుమారి, ఈపూరి వెంకటరెడ్డి, జి. మల్లికార్జునుడు, నానా, చుండూరు శేషుమాంబ, టి. పద్మావతి, వై. పద్మావతి, పి. బలరాం, దారివేముల అనిల్ కుమార్, పి. దుర్గాదేవి పాల్గొన్నారు. రామాయణంలోని అనుబంధాలపై పలు అంశాల్ని వివరిస్తూ కవితాగానం చేశారు. అనంతరం ఆలయ నిర్వాహకులు కాకి శ్రీనివాసరావు దంపతులు కవులకు ప్రశంసాపత్రం అందించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘ సభ్యుడు బుర్రి కుమార్‌రాజు పాల్గొన్నారు.

8న మాలల చైతన్య సదస్సు



నెహ్రూనగర్: రాష్ట్రంలోని మాలల ఐక్యతే ధ్యేయంగా ఈ నెల 8న అన్నవరంలో మాలల చైతన్య సదస్సు నిర్వహించనున్నట్లు మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్‌కుమార్ తెలిపారు. అంబేడ్కర్ భవన్‌లో గురువారం మాల సంఘాల జేఏసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో మాలలపై దాడులు అధికమవుతున్నాయని ఆరోపించారు. కోనసీమకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరును వ్యతిరేకిస్తూ చేపట్టిన హింసలో మంత్రి, ఎమ్మెల్యే ప్రభుత్వ ఆస్తుల్ని ధ్వంసం చేసిన వారిపై పెట్టిన కేసుల్ని ఎత్తివేయడాన్ని ఖండించారు. వివిధ కేసుల్లో ఎస్సీలపై పెట్టిన కేసుల్ని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వివిధ మాల సంఘాల నాయకులు గోదా జాన్‌పాల్, మల్లెల వెంకట్రావు, పంతగాని రమేష్, తుమ్మల ఫ్రాన్సిస్, బత్తుల వీరాస్వామి, ఈమని చంద్రశేఖర్ పాల్గొన్నారు.

యువత భవిష్యత్తుకు దశదిశా నిర్దేశించేలా జగన్ పాలన

వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కష్ణం హరికృష్ణారెడ్డి

పట్నంబజారు: యువత భవిష్యత్తుకు దశదిశా నిర్దేశించేలా రాష్ట్ర ముఖ్యమంత్రిగా వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కష్ణం హరికృష్ణారెడ్డి తెలిపారు. బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ ప్రాంతీయ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత లక్షలాది ఉద్యోగాలు ఇచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందని తెలిపారు. భవిష్యత్తులోనూ అనేక పరిశ్రమల ద్వారా ఉద్యోగాలు ఇచ్చే పరిస్థితులు ఉన్నాయని పేర్కొన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో సీఎం జగన్‌కు అండగా యువత నిలబడాలని ఆయన కోరారు. బృందావన్ గార్డెన్స్‌లోని ప్రాంతీయ కార్యాలయంలో శుక్రవారం జరిగే 'జగనన్న పాలనలో యువత సాధికారిత' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి యువత సమావేశానికి హాజరుకావాలని ఆయన కోరారు. జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ ముఖ్య నేతలు హాజరవుతారని తెలిపారు.

● వైద్యప్రదాతకు.. ఆత్మీయ స్వాగతం



చిలకలూరిపేట నియోజకవర్గం లింగంగుంట్ల గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ప్రారంభించేందుకు.. విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గురువారం రాష్ట్ర అధికార ప్రతినిధి, పొన్నూరు శాసన సభ్యుడు కిలారి వెంకట రోశయ్య కలిశారు. బొకే అందజేసి సాదరస్వాగతం పలికారు. – చేబ్రోలు

ఫార్మశీలో విప్లవాత్మక మార్పులు రానున్నాయి

- సౌత్‌జోన్ హైదరాబాద్ డిప్యూటీ డ్రగ్స్ కంట్రోలర్ డాక్టర్ రామ్‌కిషన్
- వేడుకగా 'చిప్స్' కళాశాల 18వ వార్షికోత్సవాలు



మాట్లాడుతున్న డాక్టర్ రామ్‌కిషన్, పక్కన కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: ఫార్మశీ పారిశ్రామిక రంగంలో విప్లవాత్మక మార్పులు రానున్నాయని, ఫార్మా విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని సౌత్ జోన్ హైదరాబాద్ డిప్యూటీ డ్రగ్ కంట్రోలర్ డాక్టర్ రామ్‌కిషన్ తెలిపారు. గురువారం చౌడవరం గ్రామంలోని చేబ్రోలు హనుమయ్య ఫార్మశీ కళాశాల(చిప్స్) 18వ వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. ఫార్మశీ రేగ్యులేటరీ విభాగంలో బి ఫార్మశీ, ఫాం డీ విద్యార్థులకు ఎన్నో మంచి ఉద్యోగావకాశాలున్నాయని పేర్కొన్నారు. ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ టీవీ నారాయణ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా భారత ఫార్మా రంగం ఉత్పత్తులు ప్రస్తుతం బాగా ఎగుమతి అవుతున్నాయన్నారు. 2030 నాటికి మన దేశ ఔషధ రంగానికి మహర్దశ పట్టనుందన్నారు. పెరుమాల్ ఫార్మా సొల్యూషన్స్ ఆర్ అండ్ డీ సీనియర్ మేనేజర్ డాక్టర్ పెండ్యాల రామారావు మాట్లాడుతూ.. ఫార్మశీ పట్టభద్రులు కొందరు పీజీ స్థాయిలో ఫార్మా విద్యను వదిలి ఇతర కోర్సులను ఆశ్రయించటం ఆశ్చర్యం కలిగించిందన్నారు. ఇది తాత్కాలిక ఉపశమనమే కానీ భవిష్యత్తు స్థిరత్వం కాదన్నారు. కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ మాట్లాడుతూ 18 ఏళ్లుగా కళాశాల, విద్యార్థులు సాధించిన విజయాలను వివరించారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. కళాశాల కార్యదర్శి డాక్టర్ సీఎస్ శ్రీనివాస్, ఎన్ఆర్ఐ జనరల్ హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ జి.శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.విద్యాధర్, కోశాధికారి ఆర్.గోపాలకృష్ణ, గోపీచంద్ పాల్గొన్నారు.

డ్రోన్ పిచికారీపై రైతులకు అవగాహన



జొన్నపంటపై డ్రోన్‌ద్వారా పురుగు మందు పిచికారి

గుంటూరు రూరల్: ఆధునిక యంత్ర పరికరాలను వినియోగించి వ్యవసాయంలో సమయాన్ని, నగదును ఆదా చేసుకోవచ్చని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ జి.సుబ్బారావు తెలిపారు. గురువారం జొన్నలగడ్డ గ్రామంలో జొన్న పంటలో డ్రోన్ ద్వారా పురుగు మందు పిచికారీపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఏడీఆర్ మాట్లాడుతూ డ్రోన్ ద్వారా పురుగు మందు పిచికారి, ఎరువు చల్లుకోవటం చేయవచ్చన్నారు. ఈ విధానంతో కూలీల ఖర్చు తగ్గుతుందన్నారు. కేవలం పది లీటర్ల నీటితో సుమారు ఆరు నిమిషాల్లో ఎకరం పంటపై పురుగు మందు, ఎరువు చల్లుకోవచ్చని తెలిపారు. 25 శాతం పురుగు మందు ఆదా అవుతుందన్నారు. ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకురాలు డాక్టర్ ఎల్.ప్రశాంతి, రైతులు వంగా నవీన్‌రెడ్డి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ వెళ్లాలి.. సంక్షేమాన్ని వివరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ సాంబిరెడ్డి

గుంటూరు రూరల్: కార్పొరేషన్ పరిధిలోని 40వ డివిజన్ పెదపలకలూరు గ్రామం సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్ల సమావేశం గురువారం నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ ఏరువ సాంబిరెడ్డి మాట్లాడారు. శుక్రవారం నుంచి నిర్వహించనున్న మా భవిష్యత్ నువ్వే జగన్ కార్యక్రమంపై దిశానిర్దేశం చేశారు. గృహ సారథులు, వలంటీర్లు, సచివాలయం కన్వీనర్లు వారికి కేటాయించిన ఇళ్లకు వెళ్లి.. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలని సూచించారు. వారి సమస్యలు తెలుసుకుని సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారం దిశగా కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ పిల్లి నాగేశ్వరరావు, సచివాలయం కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

అశాస్త్రీయ భావాలు వీడినపుడే అభ్యున్నతి



సభలో మాట్లాడుతున్న కొరివి వినయ్‌కుమార్

పాత గుంటూరు: అశాస్త్రీయ భావాలు వీడినప్పుడే సామాజిక అభ్యున్నతి సాధ్యమవుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. నగరంపాలెంలోని రెవెన్యూ భవన్ జొన్నలగడ్డ జోషి ప్రాంగణంలో పూలే, పెరియార్, అంబేడ్కర్ లిటరేచర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం పెరియార్ రీడర్ పుస్తక పరిచయ సభ నిర్వహించారు. సభకు ఫౌండేషన్ చైర్మన్ బత్తుల విల్సన్ అధ్యక్షత వహించారు. హేతువాద సంఘ రాష్ట్ర అధ్యక్షుడు నార్నె వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ ప్రశ్నించడం అనేది ప్రతి ఒక్కరి బాధ్యత, ఇది రాజ్యాంగం కల్పించిన హక్కు అన్నారు. మూఢ నమ్మకాల నిర్మూలన చట్టం సాధించేవరకు పోరాడాలన్నారు. దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వినయ్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హేతుబద్ధంగా, తార్కికంగా ఆలోచించాలన్నదే పెరియార్ ఆలోచనా విధానమన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పరిశ్రమలు, వాణిజ్యశాఖ కార్యదర్శి ఆర్. కరికాలవలవన్ మాట్లాడుతూ పెరియార్ అనుభవంలో నుంచి పరిణతి చెందిన మహోన్నత వ్యక్తి అని అన్నారు. రెవెన్యూ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు టి. దేవరాజ్ మాట్లాడుతూ వర్ణ వివక్షత మీద పోరాడిన పూలే, పెరియార్, అంబేడ్కర్ పూజ్యనీయులన్నారు. పుస్తకాలను పరిచయం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బండారు సురేష్, గోలి మధు పాల్గొన్నారు.